

# తిండి సదుపాయం!

నేమాని వీరభద్రరావు

★

నాకు మొన్న జనవరినుంచి పనిచేయడానికి అర్హతలేదన్న ఫర్మానా వచ్చింది.

జవసత్వాలు వున్నమనిషిని, పనిలోంచి తప్పుకోమని చెప్పడానికి వాళ్ళ కేం అధికారం వుందని అనిపించింది నాకు.

ఇంతకీ నా ఉద్యోగం ఏవిటో మీకు చెప్పే లేదు. 'చూస్తాను ఒక పొడుపుకథలా వేసి', 'నా పేరు చెప్పగానే యిరవై ఏళ్ళక్రిందటి మనుష్యులకు బొబ్బట్లు, ఆవడలు, క్షీరాన్నం, మొదలగు పిండివంటలు జ్ఞాపకంవస్తాయి.

ఇంకా గ్రహించలేరా, పోనీ నేనే చెప్తాను. 'నేను స్కూళ్ళమీద అధికారిని.' నేను యింకా పనిచేస్తానని భీష్మించుక్కూర్చుంటే యీడ్చేసేలా వున్నారని పని వదలి యింకొక యువకుడికి స్థానమిచ్చాను. వెంటనే అందరి మిత్రులకు వుత్తరాలు వ్రాశాను; విశ్రాంతి తీసుకొనే అవకాశం దొరికిందని, పనిచేసేకాలంలో మహక్రిందా మీదా పడి యిబ్బందిపడినవాడిలాగ.

అందరూ సమాధానాలు వ్రాశారుగాని ఒకాయన వ్రాసిన సమాధానం మీకు చెప్పకుండావుండలేను. "పంతులుగారూ! మీరు రిటైరయ్యారని విశ్రాంతి తీసుకోవచ్చునని వ్రాశారుగాని, ఒక నెలరోజులు యింటిదగ్గర కూర్చొని మీ మీ అభిప్రాయాలు, అనుభవాలు నాకు తిరిగి వ్రాయండి' అని వ్రాశాడు.

ఆరిసీడి తస్సాదియ్యా, ఎంత అనుభవం సంపాదించాడనిపిస్తూంది నాకు.

ఇంటిదగ్గర రెండుపూటలా తిని కూర్చుంటే అవి ఆలోచనలుగావు, పీడించుకు తింటున్నాయి. వాటి ఫలితమే యీ వ్యాసరూపంగా వెలువరిస్తేగాని మనశ్శాంతి చిక్కలేదు.

వుద్యోగంలో చేసిన పనులన్నీ ఒక్కొక్కటే స్మృతిపథాని కొస్తున్నాయి.

ప్రవేశించిన క్రొత్తరోజుల్లో నాతోనే వుంది ప్రపంచం అనుకునేవాణ్ణి, నేను లేకపోతే భారతదేశంలో విజ్ఞానశాఖే లేదనుకునేవాణ్ణి. హృదయం విప్పి మాట్లాడిన తాబేదారుకి వెంటనే శిక్షే, నాలో లేని సుగుణాలను నాకు ఆరోపించి పొగిడిన వాడికి ఎంతో మేలు చేద్దామని ప్రయత్నించీవాణ్ణి. మేలు చెయ్యడానికి నాదగ్గర పెద్ద పలుకుబడి, సమర్ధతా వున్నట్లు.

నా వుద్యోగంవుండే, మహా ఆనందంగా వుండేది. వుండదూ మరి, తక్కిన శాఖాధికారులకు వున్న పూచీ నాకెక్కడిది. ఒక అంకె ఎక్కువేసినా భయంలేదు, తక్కువేసినా యిబ్బందిలేదు. ఆ రోజుల్లోకూడా ప్రభుత్వం లోకానికి చూపెట్టడానికి అభివృద్ధిని సూచించే అంకెలువుంటేచాలు.

ఇంకేంవుంది? కాలమంతా తిండిమీద కేంద్రీకరించేవాణ్ణి, స్కూలుకు తణిఖీకి పోగానే మేష్టరు భయపడుతూ 'అయ్యా! ఏం చేయించమన్నారు?' అనేవాడు. 'నీకు నా సంగతి, నా భోజనం తెలీదా ఏవిటి ఏవో యిన్నిగార్లు, యింత క్షీరాన్నం వండించు, బొబ్బట్లు చద్దీ నాకు పడవు అనేవాణ్ణి, 'మీ భోజనం నాకు తెలిదా' అని ఓదార్చిపోయేవాడు ఆ మేష్టరు, ఇంక యీ ప్రయత్నాలేగాని మరి స్కూలు గొడవ యిద్దరికీ చేయవలసిన రెండోపనిక్రింద లెఖ్ఖే.

కాస్త సదుపాయంగా వుంటే, 'ఒరే అబ్బీ, ప్రక్కవూరు పోయివస్తాను. రాత్రికి ఆట్టే ప్రయత్నం చెయ్యకు, చాలా వేడిచేసింది. యిన్ని పాలకోవాబిళ్ళలు.... అని నసిగేవాణ్ణి.


ఆ రోజులు పోయాయి. ఇక చెప్పినకొద్దీ మధురస్మృతులు తప్ప మరేంవున్నాయి. ఈ

రోజులే వేరు. వుపాధ్యాయులుకూడా సమ్మెలట. స్కూళ్ళ అధికార్లమీద వ్యాసాలట. మొన్న ఒకాయన నా గురించే అనుకుంటాను 'లంచాల పులి' అన్న శీర్షికతో వ్యాసం రాశాడు. ఆరి వీడి కొంప లంటుకోనూ-వున్నదున్నట్లు వ్రాశాడు.

మొన్న ఒక యినస్పెక్టరు చెప్పేడు. తణిఖీకి వెళ్ళినప్పుడు ఒకపిల్ల ఏదో చెప్పకపోతే బుగ్గపట్టుకున్నాడట. వెంటనే మేష్టరు 'ఏవండోయ్ స్కూలుగురించి మీ యిష్టంవచ్చినట్లు వ్రాయండిగాని పిల్లల్ని కొట్టడానికి మీకు వలనుపడదు' అన్నాడట. ఏమి ధైర్యమొచ్చింది యీ అయ్యవార్లకి.

యస్ వి. వి. అన్న పొడక్షరాలతో ఒకయాన ఒక పుస్తకమే వ్రాశాడు. అందులో యినస్పెక్టర్ని ఎంత న్యూనతపరిచాడు: బిళ్ళబంట్రోతు కూడా వుంటేగాని ఇనస్పెక్టరు ప్రజలచే గుర్తింపబడడట. ఎంత తెలివిమీరిపోయింది ప్రజ.

లైసెన్సు అవసరంలేదు!



అమెరికన్ మాడల్ రివాల్వరు

మీ ప్రాణ, ధన, మానాలను రక్షించుకొనుటకు ఆరుగుండ్లు గల ఆటోమాటిక్ రివాల్వింగు తుక్కుతో 15 ఔన్సుల బరువు, 8 అంII పొడుగుగల ఈ పిస్టలు గొప్ప శబ్దమున్ను నిప్పురవలను వెలువరించును. నేడే ఆర్డరివ్వండి.

నెం. 222 నెం. 333 నెం. 444
రు. 6/8. రు. 7/8. రు. 8/8.

అదనంగా 4 డజన్ల తోటాలు రు. 4/8. తోలుపటకా పిస్టలు కేసుతో ఒక్కొక్కటి రు. 5. పిస్టలు ఆయిలు సీసా రు. 1.

విల్సన్ ట్రేడింగ్ కార్పొరేషన్,
పోస్టు బాక్సు 247, కాన్పూర్ (యు.పి.)

నా రోజుల్లో. నా మాట అలా వుంచి మా ఆవిడే కదూ యింటి సామాన్లన్నీ పురమాయించి తెప్పించడం, ఏ మేష్టరేనా కాస్త బుర్రతిరుగుడుగా వున్నాడని తెలిసిందంటే చాలు '100 నీళ్ళ కొబ్బరి కాయలు, 50 కురిడీలు, ఒక నేతీజాడీ జరిమానా వేసేనన్న మాటే.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే: మా మిత్రుడు వ్రాసినదాంట్లో పదహారణాల నిజం వుందని గ్రహించాను.

అప్పటి స్మృతులవల్ల నాకు శాంతే లేదు. పింఛను పుచ్చుకున్న నాతో ఎవరు మాట్లాడతారు? వెధవ ఉద్యోగంచేశానుగాని సంఘంతో సంబంధం లేకుండా అయిపోయింది. మొన్న ఒక మేష్టరు యింకొక మేష్టరుకి నన్ను చూపుతూ 'వృద్ధ గృధ్రమురా' అంటున్నాడు.

"నేను మీ పత్రికాముఖంగా కోరేదేమంటే: నాకు మళ్లీ జన్మలో నేను చేసినటువంటి బానిస వుద్యోగం కాక, కష్టించి తత్ఫలాన్ని పొందగలిగినదే కావాలిగాని, ప్రజల దృష్టిలో ఒకప్పుడు కాకపోయినా మరొకప్పుడైనా విమర్శకు గురియైన అధికారం వుద్యోగం నాకు వద్దని, భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

నేను యిలా వ్రాసేనని నా వృద్ధ సతీమణికి చెప్పేలేదు. చెబితే యీ బ్రతికే నాలుగు సంవత్సరాలూ బ్రతకనిస్తుందా. 'మా ఆయన వుద్యోగం చేసేటప్పుడు యిలాగా, అందరూ గడగడా వణికేవారు' అని చెప్తూ మురిసిపోతుంది. ఇదివరకు అనుభవించిన దర్జా మరిచిపోలేక మొన్న అంది "ఏవండీ, మళ్లీ యింకో వుద్యోగంలో ప్రవేశించ కూడదూ' అంది. వెర్రిమొఖమా నా శరీరం దృఢంగా వుందని ఎవరిస్తారే సర్టిఫికెట్లు అన్నాను.

చదువుకున్నప్పుడు సర్టిఫికేటులో మా వాళ్లు ఏళ్లు ఎక్కువేయించేశారు అని అబద్ధం చెప్తాను. నిజానికి రెండేళ్ళు తక్కువే వేయించుకున్నాను. ఈ శరీరపుష్టి వూరికే వచ్చిందా, నాకున్న తిండి సదుపాయం ఎవరికుంటుంది?